



ఆనందాలకేళి.. దీపావళి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాల నడుమ కష్టాల చీకట్లు తొలగించి సుఖాల వెలుగులు ప్రసాదించాలని కోరుతూ ఉత్సాహంగా జరుపుకునే పండుగ దీపావళి. ఆనంద దీపాలను మదిలో వెలిగించుకొని సుఖసంతోషాల జీవితానికి స్వాగతం పలుకుతూ దీపావళిని ఎంతో సరదాగా జరుపుకుంటారు. ఇంటిని దీపాలతో అలంకరించి లక్ష్మీదేవికి స్వాగతం పలికి అష్ట ఐశ్వర్యాలు ఉండాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగే దీపావళి. దీపాల వెలుగులతో నిండే దివాళికి చిన్నా పెద్దా సిద్ధమయ్యారు. దీపావళి సంబరం అంబరాన్ని అంటేలా గురువారం పండుగ చేసుకునేందుకు జిల్లా వాసులు సమాయత్తమవుతున్నారు. వెలుగులు జిలుగుల మధ్య గ్రామాలు పట్టణ ప్రాంతాలు నిండిపోయాయి. ఇక గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో వెలసిన టపాసుల దుకాణాలు అక్కడక్కడ కొనుగోలుదారులతో కిక్కిరిస్తున్నాయి. ఆనందాల దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని పలువురు సూచిస్తున్నారు. టపాసులు కాల్చే సమయంలో తగిని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.


బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు





టీటీడీ బోర్డు సభ్యుడిగా మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఓర్వకల్లు మండలం హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. మల్లెల రాజశేఖర్ ప్రస్తుతం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలోనూ జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉంటూ జిల్లాలో ఎంతో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల మన్ననలు పొందడమే కాకుండా ఆయన చేసిన అభివృద్ధి సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ బోర్డులో 24 మందిని సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్ టీటీడీ బోర్డు సభ్యునిగా ఎన్నుకోవడంతో గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా

టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. శ్రీనివాసుడి సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. నాకు టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, అలాగే మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా. స్వామివారి సేవలో సాధారణ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా.

- మల్లెల రాజశేఖర్, టీటీడీ బోర్డు సభ్యుడు









కార్తీక మాసోత్సవాలకు

సర్వం సిద్ధం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహానంది ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు

మహానంది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తీర్థం, క్షేత్రం కలిసిన మహానంది క్షేత్రంలో ఈ ఏడాది నవంబరు 2నుంచి డిసెంబరు 30 వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లపై 'ఆంధ్రజ్యోతి'తో ఈవో మాట్లాడారు.

ప్రశ్న: కార్తీక మాసం పురస్కరించుకొని ఏవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు?

ఈవో: నాలుగు కార్తీక సోమవారాలు వచ్చాయి. వేలాదిమంది భక్తులు మహానందీశ్వరుని దర్శనం కోసం తరలివస్తారు. దీని కోసమే శని, ఆది, సోమవారాల్లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే కార్తీక పుణ్య స్నానాలకు అనుమతిస్తాం. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు మంచినీరు, పాలు ఉచితంగా పంపిణీ చేస్తాం. అదనంగా 35 మంది వర్కర్లను ఏర్పాటు చేశాం. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. తాత్కాలిక వైద్యసేవలు అందిస్తాం. నిరంతర దర్శనం ఏర్పాటు చేశాం. రద్దీ రోజుల్లో కల్యాణ మంటపంలో భక్తులకు సామూహిక అభిషేకాలు నిర్వహించే ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదం అందచేస్తారా?

ఈవో: కార్తీక మాసం సందర్భంగా ఆది, సోమవారాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహిస్తాం. మిగతా రోజుల్లో మధ్యాహ్నం వేళల్లో యథావిధిగా 200 మందికి అన్నదానం జరుపుతాం.

ప్రశ్న: భక్తులకు వసతి సౌకర్యాలు ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారు?

ఈవో: ఆలయ పరిధిలోని పోచా విశ్రాంతి భవనాన్ని ఉపయోగంలోకి తెచ్చాం. గతంలో ఎప్పుడో ఒకసారి ఉపయోగించే భవనాన్ని నిరంతరం భక్తుల వసతి కోసం ఏర్పాటు చేశాం. అదనంగా కొన్ని వసతులు కల్పించి భక్తులు విశ్రాంతి తీసుకొనేందు కోసం ఉచితంగా చాపలు ఏర్పాటు చేశాం. రద్దీకి అనుగుణంగా టోల్‌గేట్ ప్రక్కన, పాత తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో భక్తుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న: కార్తీక పౌర్ణమి, కోటి దీపోత్సవం, జ్వాలా తోరణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారా?

ఈవో: నవంబరు 15 కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నది. అలాగే పౌర్ణమి రోజు క్షేత్రంలో జరిగే కోటి దీపోత్సవం, జ్వాలాతోరణంలో భక్తులు పాల్గొనేందుకు ఆలయం పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. కార్తీక మాసం ముగింపు రోజుల్లో క్షేత్రంలో లక్షబిల్వార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తాం.

ప్రశ్న: లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారా?

ఈవో: భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా చేస్తాం. పులిహోరను ఎప్పటికప్పుడు తయారు చేసి భక్తులకు కౌంటర్ల ద్వారా విక్రయించే ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: కార్తీకమాసం ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు ఏఏ శాఖల సహకారం తీసుకొంటున్నారు?

ఈవో: మహానందిలో నెల రోజుల పాటు జరిగే కార్తీక మాస ఉత్సవాలకు అన్ని శాఖల సహకారం తీసుకుంటాం. ఆలయ సిబ్బందితో పాటు సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహిస్తాం.

అవుకును అభివృద్ధి పథంలో నడిపిస్తా

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



అవుకులో సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవుకు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో మొదటి విడతలో రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. రెండవ విడతలో మిగిలిన సీసీ రోడ్ల పనులు పూర్తి చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానన్నారు. అనంతరం కాలనీ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, మండల నాయకులు బత్తిని మద్దిలేటిగౌడు, దంతెల రమణ, తిక్కన్న, మొట్ల రామిరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎస్ రామకృష్ణారెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటరాముడు, మిద్దె ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి ఈశ్వరయ్య, జయశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ : అవుకులోని ప్రభుత్వ ఆసుపత్రిని బీసీ జనార్దన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపరిండెంట్ డాక్టర్ అభినయ్‌తో కలసి ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి డాక్టర్లు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉన్నారని అన్నారు. ప్రస్తుతం ఓపీ 300 ఉందని, ఇంకా పెంచే విధంగా డాక్టర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవికుమార్, కళ్యాణ్‌శ్రీనివాస్, జయరాముడు, వినోద్‌కుమార్, సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో చీకటి వీడి వెలుగులు : బీసీ

బనగానపల్లె: గత ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్రంలో చీకట్లు నింపిందని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెలుగులు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు దీపావళి కానుకగా ఇచ్చిన మాట ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.

స్వీయ సత్ప్రవర్తనతోనే అవినీతి నిర్మూలన

కలెక్టర్ రాజకుమారి



విజిలెన్స్ వారోత్సవాలలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతిని అంతమొందించే ప్రక్రియ స్వీయ సత్ప్రవర్తన ద్వారానే సాధ్యమవుతుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది అక్టోబరు 28 నుంచి నవంబరు 3 తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశం యొక్క శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని.. ఈ మూడు పదాలలో ఎంతో అంతర్లీనత దాగి ఉందన్నారు. పౌరులలో స్వీయ సత్ప్రవర్తన అలవర్చుకొని అవినీతి రహిత సమాజానికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే నకిలీ విత్తనాలు, రసాయనిక ఎరువులతో రైతులు రైతులనే మోసం చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంస్థలో విజిలెన్స్ విభాగం ఉన్నప్పటికీ మన దృక్పథం మార్చుకోనంత వరకు అవినీతి కొనసాగుతూనే ఉంటుందన్నారు. జేసీ విష్ణు చరణ్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన గురించి విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించుకోవడం దురదృష్టకరమన్నారు. విజిలెన్స్ ఇన్‌చార్జి డీఎస్పీ కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవినీతి నియంత్రణపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్ గండి పూడ్చాలి

సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

మిడుతూరు, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): అలగనూరు రిజర్వాయర్ గండి పూడ్చకపోతే ఆందోళన తప్పదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు హెచ్చరించారు. బుధవారం అలగనూరు రిజర్వాయర్‌ను సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలను కలుపుకుని అలగనూరు తలముడిపితో సహా కాల్వ వెంట వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న రిజర్వాయర్‌ను అప్పట్లో రూ.59 కోట్ల నిధులతో నిర్మించారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూడు కోట్ల నిధులతో పూర్తి చేయాల్సిన గండికి నేడు రూ. 50 కోట్ల నిధులు కేటాయించిన పూర్తి చేసే పరిస్థితి లేదన్నారు. గత పాలకులు చేసిన తప్పిదాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేయకూడదని ఆయన సూచించారు. రిజర్వాయర్ మరమ్మతులపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యుడు రఘురాం మూర్తి, నాయకులు రమేష్ బాబు, రైతు సఘం జిల్లాకార్యదర్శి సోమన్న, సుబ్బారెడ్డి, వెంటేశ్వర్లు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత, వినోద్ పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు చేపట్టిన ర్యాలీలో భారత్ మాతాకి జై అనే నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చౌక్‌లో జిల్లాలో అమరులైన పోలీసులకు నివాళి అర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో జీవించేందుకు నిరంతరం పోలీసులు శ్రమిస్తుంటారన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ఒక్కరి జీవితాలలో దీపావళి పండుగ వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ.... రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖమంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీ సీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ , నం ద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రజలందరూ దీపా వళి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలి పారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.30 లక్షలు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈవో

మహానంది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించగా రూ.30,23,514 వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉభయ దేవాలయాల్లోని హుండీతో పాటు అన్నదానం, గోశాల హుండీలను సిబ్బంది సహాయంతో ఆలయం ప్రాంగణంలోని అభిషేక మంటపంలో లెక్కింపు జరిపామని చెప్పారు. ఇందులో ఉభయ ఆలయాల్లోని హుండీల ద్వారా రూ.29,28,740 అన్నదానం ద్వారా రూ.78,712 గోశాల హుండీ ద్వారా రూ.16,062 వచ్చినట్లు ఈవో చెప్పారు. 50 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, నంద్యాల డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, బాలాజి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం




మృతుడు ఖాజా



గాయపడ్డ సద్దాం

కోవెలకుంట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నిలిచి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కోవెలకుంట్ల మండలంలోని అమ్మడాలమెట్ట వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బనగానపల్లె నుంచి బైక్‌పై ఖాజా హుస్సేన్, సద్దాం హుస్సేన్ యువకులు కోవెలకుంట్లకు బయల్దేరారు. అయితే రాత్రి అమ్మడాల మెట్ట వద్దకు రాగానే ఆగిఉన్న లారీని ఆ యువకులు వేగంగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఖాజా హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందగా సద్దాం హుస్సేన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. బుధవారం జూరాల నుంచి 22,330 క్యూసెక్కులు, సుకేలుల నుంచి 8,892 క్యూసెక్కులు మొత్తం 31,222 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 36,471 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 882.10 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 199.7354 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7,069 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కులు మొత్తం 43,669 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

తెలుగుగంగ ప్రధాన కాల్వలో వ్యక్తి మృతదేహం

రుద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వలో వ్యక్తి మృతదేహం బుధవారం నీటిలో కొట్టుకుని వచ్చినట్లు రైతులు, రైతు కూలీలు తెలిపారు. వ్యక్తి మృతదేహం రిజర్వాయరు వైపు కొట్టుకుపోయిందని వారు తెలిపారు. ఒంటిపై నిక్కరు చొక్కా మాత్రమే ఉన్నాయన్నారు. ప్రమాదవశాత్తు మరణించాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై విచారణ



బాధితులను విచారిస్తున్న ఏఎస్పీ

పాణ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాణ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రెండు కేసులను ఏఎస్పీ యుగంధర్‌బాబు బుధవారం విచారించారు. ఘటనా స్థలాల్లో బాధితులను విచారించారు. అనంతరం శిథిలావస్థలోని పోలీసు గృహాలను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. పోలీసు శాఖకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేయాలని సీఐ కిరణ్ కుమార్‌రెడ్డికి సూచించారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కేసుల్లోని రికవరీలపై అసహనం వ్యక్తం చేశారు. నెలలోపల రికవరీలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు న్యాయం చేయాల్సిందే

మాజీ ఎమ్మెల్యే కాటసాని



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఉల్లి రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం నగరంలోని మార్కెట్ యార్డులో రోజుల తరబడి ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో కర్నూలు ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

శ్రీశైలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. దర్శనానంతరం ఎంపీ ఓ ప్రైవేటు కార్యక్రమం అఖిలభారత కురువంశ నిత్య అన్నదాన సత్రం సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ శ్రీశైలం మహాపుణ్యక్షేత్రం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని, అఖిలభారత కురువంశ నిత్య అన్నదాన సత్రం నుంచి భక్తులకు మరింత సేవలందించాలని అన్నారు. సత్ర ఛైర్మన్, అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొనాన్నరు.

విషాదంగా విహారయాత్ర

జమ్ముకాశ్మీర్‌లో రోడ్డుప్రమాదం • పత్తికొండ యువకుడి మృతి


ఆనంద్ రెడ్డి(ఫైల్)

పత్తికొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళికి యూనివర్సిటీలో సెలవులు రావడంతో స్నేహితులతో కలిసి కారులో జమ్మూకశ్మీర్‌కు విహారయాత్రకు వెళ్లిన పత్తికొండకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పత్తికొండ పట్టణానికి చెందిన ప్రతాప్ రెడ్డి, అనిత దంపతుల పెద్ద కుమారుడు వెంకట్ ఆనంద్ రెడ్డి(20) పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్(ఎల్పీ) యూనివర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవులు రావడంతో మరో ఆరుగురు స్నేహితులతో కలసి కారులో మూడు రోజుల క్రితం జమ్ము కాశ్మీర్‌కు విహారయాత్రకు వెళ్లారు. కారులో ముగ్గురు విద్యార్థులు, నలుగురు విద్యార్థినులు ఉన్నారు. అయితే బుధవారం ఉదయం 6 గంటల సమయంలో అనంత్‌నాగ్ ప్రాంతంలో యువకులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పత్తికొండకు చెందిన వెంకట్ ఆనంద్ రెడ్డితో పాటు మరో విద్యార్థి మృతి చెందగా, మిగిలిన వారు గాయాల పాలయ్యారు. యువకుడి తండ్రికి అనంత్‌నాగ్ పోలీసులు సాయంత్రం ప్రమాద వివరాలను తెలియజేశారు. దీంతో యువకుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి విమానంలో జమ్ము కాశీర్మర్‌కు వెళ్లారు. కాగా మృతిచెందిన యువకుడి తండ్రి ప్రతాప్‌రెడ్డి పత్తికొండ మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్, టీడీపీ నాయకులు ప్రమోద్ కుమార్‌రెడ్డికి స్వయానా మేనల్లుడు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారనీ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కోట్ల ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చిన తర్వాత ప్రజలకు మేలు చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తూ ఇచ్చిన మాట నిలుపుకుంటున్నారన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేసి పేదల జీవితాలకు భరోసా కల్పించారన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో ఈ దీపావళి కొత్త వెలుగులు పంచాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే కోట్ల అన్నారు. నియోజకవర్గంలో రైతులకు మరిన్ని ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల వెల్లడించారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి


ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, అధ్యాపకులు నాగ మస్తానయ్య, రాజు, వెంకట సుబ్బయ్య, జయచంద్ర, స్వరూప పాల్గొన్నారు.

యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో : శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు రూ.12 కోట్లు

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో రూ.12 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయని విద్యుత్‌శాఖ ఏఈ షాజహాన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల బిల్లులు అధికంగా ఉన్నాయని తెలిపారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం 16 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ వాడుకోవచ్చని అన్నారు. అధిక యూనిట్లు వాడితే బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ బిల్లులను రైతులు చెల్లించాలని తెలియజేశారు. బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్‌లు తొలగిస్తామని అన్నారు. అక్రమ విద్యుత్‌కు పాల్పడితే జరిమానాలు, కేసులు తప్పవని హెచ్చరించారు. రైతులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశామని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 840 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని, వాటిలో 486 క్వింటాళ్లు రైతులకు సబ్సిడీ ద్వారా పంపిణీ చేశామని అన్నారు. చిన్నవంగలి గ్రామంలో 12 క్వింటాళ్లు, మద్దూరు 22, మల్లేవేముల 322, ముత్యాలపాడు 29, నేలంపాడు 40, పెద్దబోదనం 54, పెద్దవంగలి 5 క్వింటాళ్లు పంపిణీ చేశామని అన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలని ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న టీఏలు, ఎఫ్‌ఏలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఉపాధి కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలని, మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అన్నాను. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఈసీ పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులకు మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ ఫేజ్‌లో కౌన్సెలింగ్‌లు పూర్తికాగా మిగిలిన ఆరు సీట్లకు కొత్త విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇంటర్ బైపీసీ విద్యార్హత కలిగి, రోస్టర్ కేటగిరికి చెందిన విద్యార్థులు మాత్రమే రూ.100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నవంబరు 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 8న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. డార్క్‌రూం అసిస్టెంట్‌కు బీసీ(డీ)కి ఒకటి, బీసీ(ఏ)కి ఒక సీటు, డీఎంఐటీ కోర్సులో ఎస్టీకి ఒకటి, అనస్థీషియా కోర్సులో బీసీ-సీకి ఒకటి, బీసీ (డీ)కి ఒకటి, డీఎంఎల్‌టీ కోర్సులో బీసీ-సికి ఒక సీటు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్‌యూలో టీడీపీ నాయకుడి హల్‌చల్



- ఓ ప్రొఫెసర్‌కు పోస్టింగ్ ఇవ్వాలంటూ హడావుడి
- పలు విభాగాల్లో సీఎం సన్నిహితుడినంటూ పరిచయం
- ఏమి జరిగినా తనకు సమాచారం ఇవ్వాలంటూ హుకుం

కర్నూలు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో పది రోజులుగా ఓ టీడీపీ నాయకుడు హల్‌చల్ చేస్తున్నాడు. తాను సీఎం సన్నిహితుడినంటూ పలు విభాగాల్లో హడావుడి చేస్తున్నాడు. మంగళవారం శ్రీ క్రిష్ణ దేవరాయ యూనివర్సిటీలో పని చేస్తున్న ఓ ప్రొఫెసర్‌ను తీసుకెళ్లి డిప్యుటేషన్‌పై పోస్టింగ్ ఇవ్వాలంటూ ఇన్‌చార్జి వీసీ ఎన్‌టీకే నాయక్‌ను కోరారు. తాను ఇన్‌చార్జిని మాత్రమేనని, రెగ్యులర్ వీసీ వచ్చాక పరిశీలిస్తారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తాను అధికార పార్టీ కీలక నాయకుడి ఆదేశాలతో వచ్చానని, తన మాటకు విలువ ఇవ్వాల్సిందేనంటూ చాంబర్‌లో బెదిరింపులకు దిగినట్లు సమాచారం. పక్కనే ఉన్న రిజిస్ట్రార్ జోక్యం చేసుకొని పద్ధతి ప్రకారం ప్రక్రియ కొనసాగుతుందని చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి వర్సిటీలోని పలు విభాగాల్లోకి వెళ్లి తాను సీఎం సన్నిహితుడినని, క్యాంపస్‌లో ఏం జరిగినా తన దృష్టికి తీసుకు రావాలని కొందరు ప్రొఫెసర్లకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఆయన వ్యవహార శైలిపై ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. ఈ విషయంపై రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడును వివరణ కోరగా క్యాంపస్‌లోకి ఓ నాయకుడు వచ్చిన మాట వాస్తవమేనన్నారు.

తుండ్లవాగు రిజర్వాయర్ పరిశీలన

రుద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని తుండ్లవాగు రిజర్వాయర్‌ను తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎంసీ సుబ్బరాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుండ్లవాగు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. అనంతరం రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అదేవిధంగా తెలుగుగంగ ప్రధాన కాల్వను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శివశంకర్‌రెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

డోన్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా విక్రయదారులు విక్రయాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని డోన్ అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడు అన్నారు. బుధవారం పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న మార్కెట్ యార్డు ప్రాంతంలో బాణాసంచా విక్రయదారులకు డోన్ అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో డెమో నిర్వహించారు. బాణాసంచా నిల్వల వద్ద చిన్నారులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా చిన్నపాటి ప్రమాదం జరిగినా అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బేతంచెర్ల: దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ రమేష్ సూచించారు. బుధవారం రాత్రి పట్టణంలోని పోలీస్ గ్రౌండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపులను ఆయన పరిశీలించారు. అలాగే తహసీల్దార్ మారుతి క్రాకర్స్‌షాపులను సందర్శించి షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

భూరీసర్వేలో సమస్యలు పరిష్కారం

రుద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భూమి రీసర్వే జరిగిన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. గ్రామ రెవెన్యూ అధికారులను అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సూచించారు. ఆయన వెంట సర్వేయరు రమణ, కార్యదర్శి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కురువ వీధికి చెందిన తిరుపాలు ఇటీవల ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో ఆ వార్డులోని టీడీపీ నాయకులు తిరుపాలుకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.49 వేలు మంజూరయ్యాయి. దీంతో ఎమ్మెల్యే జయసూర్య బాధితుడి ఇంటికి వెళ్లి ఆ చెక్కును టీడీపీ నాయకుల సమక్షంలో అందజేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రవి, మహేశ్వర్‌రెడ్డి, షకీల్ అహ్మద్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, గిరి, హుస్సేన్, బ్రహ్మయ్య, శ్రీకాంత్, ఇంతియాజ్, లింగమయ్య, మోహన్, రాజు, కళాకర్ పాల్గొన్నారు.

'కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం'

మహానంది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహానంది కార్తీక మాసోత్సవాలను సమష్టి సహకారంతో ఘనంగా నిర్వహిద్దామని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం దేవస్థానం ప్రధాన పరిపాలన భవనంలో ఈవో ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఏఈవో ఎర్రమల్ల మధు, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఆర్ఐ వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, శానిటరీ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వడ్లరామాపురంలో 'గ్రామ సభ'

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వడ్లరామాపురంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే సంబంధిత భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, టీడీపీ నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దీపావళి సందడి


బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి వైభవమంతా బాణసంచాలోనే ఉంది. పిల్లలు, పెద్దలు అంతా బాణసంచా కాల్చడానికి పండుగ కోసం ఎదురు చూస్తారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో బాణసంచా విక్రయ కేంద్రాలను నెలకొల్పారు. బుధవారం నుంచి స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో బాణసంచా విక్రయాలు మొదలయ్యాయి. సుమారు 76 స్టాళ్లు ఏర్పాటుచేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు,దుకాణాలు పెరగడం వల్ల దుకాణాలు వద్ద జనం సందడి అంతంత మాత్రంగానే ఉంది. బాణసంచా బ్రాండెడ్ రకం ఒక ధర, అన్ బ్రాండెండ్ ఉత్పతులు తక్కువ ధర పలుకుతున్నాయి. బాణసంచా ధరలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రూ.1000 పెట్టినా చేతికి సరిపడే బాణసంచా వచ్చేలా లేదు. పెరిగిన ముడి సరుకు ధరలు, శివకాశీ నుంచి రవాణా ఖర్చులు, కేంద్ర, రాష్ట్ర పన్నులు కలిసి స్వల్ప లాభంతోనే అమ్ముతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. వ్యాపారులు మాత్రం గతంలో రూ. 38 వేలు బాడుగ చెల్లించేవారమని ప్రస్తుతం రూ. 42 వేలు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు కూడా అతంతమాత్రమే ఉన్నాయన్నారు.

టీడీపీ సభ్యత్వ సంఖ్యను పెంచాలి: ఎమ్మెల్యే


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరుచరిత


పాములపాడులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నాయకుడు హరిసర్వోత్తమరావు

పాణ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ సంఖ్యను పెంచాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు, విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధిలో కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ప్రస్తుతం 70 వేల నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నెలలోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సభ్యత్వ నమోదుతో ఎంతో ఉపయోగం ఉందన్నారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు వర్తిస్తుందని, అంత్యక్రియ ఖర్చు కోసం రూ. 10 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలలో గాయపడిన వ్యక్తులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడు: ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని టీడీపీ మండల నాయకుడు ఆళగడ్డ హరిసర్వోత్తమరావు సూచించారు. పాములపాడులో స్థానిక టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు బుధవారం సభ్యత్వం నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. టీడీపీ నాయకులు షేక్ నబిరసూల్, మద్దిలేటి, మల్లికార్జున, లింగస్వామి, జలాల్‌బాషా, మల్లికార్జున, రామకృష్ణ, మన్నెం పుల్లయ్య, ధర్మయ్య కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో బుధవారం టీడీపీ సభ్యత సమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, నాగరాజు, అశోక్ తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామంలో టీడీపీ నాయకుడు చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు పరమేశ్వరరెడ్డి, శేఖర్, నాయకులు రామిరెడ్డి, మీసాల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళుతున్న డీఆర్వో ఎ.పద్మజ, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎం.దాస్‌లు జిల్లా అభివృద్ధిలో ఉత్తమ పనితీరు కనబరిచి అంకిత భావంతో పనిచేశారని కలెక్టర్ రాజకుమారి అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో కలెక్టరేట్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా బదిలీపై వెళ్తున్న డీఆర్వో, పదవీవిరమణ చేస్తున్న ఆత్మకూరు ఆర్డీవో ఎం.దాస్‌లను కలెక్టర్, జేసీ సన్మానించారు. ఈ సమావేశంలో నూతన డీఆర్వో రామునాయక్, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డోన్ ఆర్డీవో కేపీ నరసింహులు, కెఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ముగిసిన శిక్షణ


క్రీడాకారులతో ప్రిన్సిపాల్, డీన్

పాణ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ బాస్కెట్‌బాల్ జట్టు క్రీడాకారుల శిక్షణ బుధవారం ముగిసింది. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ శిక్షణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న జేఎన్‌టీయూఏ జట్టు నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు బెంగుళూరు క్రైస్ట్ యూనివర్శిటీలో జరిగే ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో పాల్గొంటుందని చెప్పారు. జట్టును ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీన్ రామిరెడ్డి, పీడీ వెంకట్, నాయక్ పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

కొత్తపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కుమార్, జిల్లా నాయకులు సాయిప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వారు కొత్తపల్లి బస్టాండు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని పలు సమస్యలపై ధర్నా చేపట్టారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

నంద్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగపేట వీధిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడు అనుపూరి శివదుర్గ అలియాస్ బట్టిని బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గత నెల 15న సంగపేటలోని ప్రమీలదేవి ఇంట్లో హరిజన పేటకు చెందిన శివదుర్గ దొంగతనానికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుడిని భీమవరం రోడ్డులోని ఈద్గా సమీపంలో అరెస్ట్ చేసి అతడివద్ద నుంచి రూ.1,80,000ల విలువగల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తులో బంగారు నల్లపూసల దండ, రెండు బంగారు గాజులు, 6వెండి కుంకుమబరిణెలు, ఒక వెండి చెంబు, ఒక వెండి గ్లాసు, రెండు వెండి దీపపు ప్రమిదలు, ఒక వెండి గిన్నె, ఒక వెండి ప్లేటు ఉన్నట్లు సీఐ వివరించారు. ఈ కేసును నంద్యాల ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో వన్ టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ ఆర్.సురేష్ చాలెంజింగ్‌గా తీసుకొని ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో వారిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

మద్యం పట్టివేత

మిడుతూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన ఎల్లయ్య అనే వ్యక్తి వద్ద 31 అక్రమ మద్యం బాటిళ్లను ఎస్ఐ ఓబులేసు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే అలగనూరు గ్రామానికి చెందిన నాగేంద్ర గౌడు అనే వ్యక్తి వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నంద్యాల క్రైం/పాణ్యం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సీఐ కిరణ్, ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది అందిన సమాచారం మేరకు తొగర్చేడు సమీపంలో జూదం ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,20,320 నగదు, 11 సెల్‌ఫోన్లు, 6మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జూదరులను అరెస్ట్ చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు ఏఎస్ఐలు రఫిక్, నరసింహులు, హెడ్‌కానిస్టేబుల్ రామాంజినేయులు, మధు, కానిస్టేబుళ్ల వెంకటేష్, గిరి, రవిని ఎస్పీ, ఏఎస్పీలు అభినందించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలంలో పూజలు

శ్రీశైలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో బుధవారం లోకకల్యాణార్థం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని చేశారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

'విద్యార్థులు పట్టుదలతో చదవాలి'


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదవాలని నూక్లియర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ రెడ్డి సూచించారు. బుధవారం నంద్యాలలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నూక్లియర్ జూనియర్ కళాశాల వార్షికోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల యాజమానులు మురళీధర్‌రెడ్డి, డైరక్టర్ వాసుదేవరెడ్డి, విశిష్ట అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కళాశాల సలహా దారుడు శ్రీనివాస్‌రెడ్డి, కవి కొప్పుల ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


కళాశాల వార్షికోత్సంలో పాల్గొన్న విద్యార్థులు

ఓంకారంలో హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకారం ఆలయ శాశ్వత హుండీని లెక్కించారు. బుధవారం ఆలయ అధికారి నాగప్రసాద్, గోపి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. ఆలయంలో 8 నెలల శాశ్వత హుండీ నుంచి రూ.2,27,476లు లభించిందన్నారు. లెక్కింపులో అర్చకులు మల్లికార్జున, ఉమామహేశ్వరీ మహిళా మండలి సభ్యులు, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

తనిఖీలు ఎక్కడ చేశారు?

- ఆడిట్ బృందంపై గ్రామస్థుల మండిపాటు


తనిఖీ బృందాన్ని నిలదీస్తున్న గ్రామస్థుడు

పగిడ్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలను బయట పెట్టేందుకు నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ ఎక్కడ చేశారంటూ తనిఖీ బృందాన్ని గ్రామస్థులు రాజేష్, రాముడు, స్వాములు నిలదీశారు. 2023-24లో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ. 7 కోట్లతో పనులు చేశారు. ఈ పనులలో జరిగిన అవకతవకలను గుర్తించేందుకు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పగిడ్యాలు సచివాలయంలో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. డీఆర్పీలు తనిఖీ చేసిన నివేదికలను వివరిస్తుండగా గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి నిలదీశారు. కొంత మంది పనులకు వెళ్లకున్నా మస్టర్లలో పేర్లు నమోదు చేసి ఫీల్డ్ అసిస్టెంట్ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తనిఖీ బృందాలు బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా తనిఖీలు చేయడంతో అవకతవకలు బయటకు రాలేదని అన్నారు. తాము తనిఖీలకు వెలల్లన సమయంలో వారు ఇళ్ల వద్ద లేరని, దీంతో వారితో మాట్లాడలేక పోయామని తనిఖీ బృందం చెప్పడంతో వారు మండిపడ్డారు. అలాంటపుడు తనిఖీలు చేయడం ఎందుకని నిలదీశారు. దీంతో తనిఖీ బృందం సభ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానం చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు రమేష్ నాయక్, మధుశేఖర్, ఉదయ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాణ్యం సిమెంటు జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకుని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలకి వచ్చిన వంద రోజుల్లోనే విద్యారంగంలో ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకుంటామనని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం, ఫీజు రీయంబర్స్‌మెంటుపై హామీలుకు స్పష్టత లేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్ నాయక్, మనోహర్, శ్రీకాంత్, కార్తిక్, భూపతి, అనిల్, తరుణ్, మహ్మద్, సురేంద్ర, చరణ్, సుజిత్, అక్షిత్, రఘునందన్, మనోజ్, మహేష్, రాజేష్, హేమంత్, రవితేజలు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

● మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మంత్రి బీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులతో శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో తహసీల్దార్‌ల వద్ద ఉండాల్సిన డిజిటల్ కీ పొలిటీషియన్ నాయకుల ఇళ్లల్లో ఉండేదని ఆరోపించారు. ప్రస్తుతం తన వద్దకు వస్తున్న సమస్యల్లో 40శాతం రెవెన్యూకు సంబంధించిన అర్జీలే వస్తున్నాయన్నారు. గతంలో వైసీపీ చేపట్టిన భూముల రీసర్వే తప్పుల తడకగా మారిందన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తున్నారని అన్నారు వీఆర్‌వోలు చిన్న తప్పు చేసినా చర్యలు తప్పవన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 25వతేదీన ప్రచురితమైన అవుకు రిజర్వాయర్‌ను ఆదుకోండి కథనంపై మంత్రి ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబును ప్రశ్నించారు. భారీ కోతలకు గురవుతున్న రిజర్వాయర్ మట్టికట్టల పనులను త్వరలో చేపట్టాలని ఆదేశించారు. రిజర్వాయర్ స్లూయిస్‌ల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించి తనకు అందించాలన్నారు. గొల్లలేరు డ్రెయిన్ ఆక్రమణను అరికట్టాలన్నారు. లేకుంటే లోతట్టు గ్రామాలు విపత్తు బారిన పడతాయన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామాల్లో నీటిఎద్దడి నెలకొనకుండ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో నిర్మితమవుతున్న అదనపు గదుల నిర్మాణం పనులపై ఆరా తీశారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. అవుకులో ఐటీఐ కళాశాలకు నూతన భవనం, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎంపీపీ మంత్రిని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా దీపావళికి గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగన్న, తహసీల్దార్ సువర్ణదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధన్, హౌసింగ్ ఈఈ వై.కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, డాక్టర్లు అభినయ్, వినోద్‌కుమార్, యమున, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, మండల శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రహదారిలోని క్లబ్ హౌస్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆధ్వర్యంలో యువకులు భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. అదే విధంగా డీఎస్పీ, సీఐలతో పలువురు పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, డోన్‌నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్డె మహారాజ్, టీడీపీ నాయకులు కేశన్నగౌడు, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డి, సుధీష్, ఓంప్రకాష్, ఆలేబాదు పరమేష్, వలసల బాలుడు, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల తనిఖీ


బాణసంచా విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణంలోని బాణసంచా విక్రయ కేంద్రాలను ఎస్ఐ రమేష్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాణసంచా కేంద్రాల వద్ద అందుబాటులో నీళ్ల, ఇసుక బకెట్లను ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాణసంచావిక్రయ కేంద్రాల వద్ద ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాణసంచా దుకాణాల వద్ద దుమపాణం సేవించే వారిని సమీపంలోని రానివ్వకూడదని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక రంగంపై అవగాహన పెంచుకోవాలని ఆళ్లగడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి సూచించారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీప్తి, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఒకేషనల్ ఉపాధ్యాయులు ప్రతాప్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేనిదే అడవిలోకి వెళ్లొద్దు

రుద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలోకి అనుమతి లేనిదేవెళ్లకూడదని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రుద్రవరం సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుద్రవరం, చెలిమ రేంజ్ పరిధిలో సుమరు 10 పెద్దపులులు సంచరిస్తున్నాయన్నారు. నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు పులులకు ఏకాంత వేళ నడుస్తుందని అన్నారు. అడవిలోకి ఆయుధాలు, వలలు, ఉచ్చులు తీసుకెళ్లకూడదన్నారు. అడవి సంరక్షణలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట రేంజర్ శ్రీపతినాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ


చాగలమర్రిలో సత్యమ్మ దేవత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోటగడ్డ వీధినందు సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం రజక సంఘం, వేద పండితులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా సభ్యులు అమ్మవారికి సామూహికంగా పసుపు, కుంకుమ, గాజులు, బియ్యం సమర్పించారు.

మండీ మర్చంట్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

బనగానపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండల మండీమర్చంట్ అసోసియేషన్ కార్యవర్గం అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యులను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కాశ్రావన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జీవి.కష్టను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నంద్యాల వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, మండీమర్చంట్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శ్రీరామవెంకటసుబ్రమణ్యం, జంగంశెట్టి, జక్కానాగరాజు, మురళి, సురేశ్, ఆయిల్ రమణ, ఆకుల రమణ , గుండారవికుమార్, సాయిరాం పాల్గొన్నారు.

● బనగానపల్లె పట్టణంలోని పెండేకంటినగర్‌లోని 11 మంది సంచారజాతుల వారికి ఇండియర్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో బుధవారం టార్పలిన్ పట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల రెడ్‌క్రాస సొసైటీ అధ్యక్షుడు సైఫుల్లా, సభ్యులు హనుమంతు , జాహిద్ భాష, పీరా, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కొలిమిగుండ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మీర్జాపురం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. మండల సర్వేయర్ సరిత ఆధ్వర్యంలో రీసర్వే సమస్యలపై రైతులతో చర్చించి, వారి నుండి అర్జీలను స్వీకరించారు.

సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశామని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 840 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని, వాటిలో 486 క్వింటాళ్లు రైతులకు సబ్సిడీ ద్వారా పంపిణీ చేశామని అన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలని ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు.

అన్నదానానికి ఆర్థిక సాయం

కోవెలకుంట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అన్నదాన కార్యక్రమానికి రూ.10వేలు ఆర్థిక సాయం దర్గాపీఠాధిపతి దస్తగిరిస్వామికి టీడీపీ నాయకులు, హైకోర్టు లాయరు అలిహుసేనీ అందించారు. బుధవారం కోవెలకుంట్లలోని అలీ హుసేన్ కార్యాలయంలో అందించారు. సంజామల గ్రామంలోని రంగరాజుపేటలో వెలసిన మౌలాసుల్తాన్ ఆలీషాఖాద్రి దర్గా పీఠాధిపతి దస్తగిరిస్వామి ఉత్సవాల సందర్భంగా ఆర్థిక సాయం అందించారు.